క్లుప్తంగా

సెల్ టవర్‌లో డీజిల్ చోరీ



డీజిల్ చోరీకి యత్నిస్తున్న దొంగలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లెలో ఉన్న జియో సెల్‌టవర్‌లో డీజిల్ దొంగతనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు..మూడు రోజుల క్రితం రాత్రి సమయంలో ఇద్దరు యువకులు చోరీకి పాల్పడిన వీడియోలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. విషయం తెలుసుకున్న జియో అధికారులు ఆదివారం పాణ్యం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టవర్ వద్ద 150 లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్లు తెలిపారు.

27న జిల్లా స్థాయి భజన పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల కాలక్షేపం కోసం బుగ్గరామేశ్వర స్వామి భజన మండలి వారిచే 27వ తేదీ రాత్రి 9.30 గంటలకు భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన భజన జట్టుకు తొలి 13 స్థానాలకు గాను వరుసగా రూ. 25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.9 వేలు, రూ.8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1016ల చొప్పున నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టు, గాయకునికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి దాతలు బైరాపురం సుధాకర్‌రెడ్డి(తిప్పాయపల్లె), సామన్నగారి మద్దయ్య(హుసేనాపురం) మైక్ సెట్టింగ్, డెక్కుల నిమిత్తం రూ.10 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల భజన బృందాలు అదే రోజు రాత్రి 9 గంటలలోగా రూ.400 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9000194078, 9985793992 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



హోమ పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి దంపతులు

కర్నూలు (టౌన్): కల్లూరు కోడుమూరు రోడ్డులోని మల్లారెడ్డి వెంచర్ సమీపంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకొని హోమం అనంతరం అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నర్సుల సమస్యలు పరిష్కరించాలి



నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయికి వినతి పత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే హెడ్‌నర్సులు, స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం నాయకులు ఆదివారం నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1 సావిత్రిబాయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పనిచేస్తున్న హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులకు ఐదు రోజులు అదనపు క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయాలని, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.లీలావతి, జిల్లా సెక్రటరీ సి.బంగారి, ఈసీ మెంబర్ యుఎం.శాంతిలత ఉన్నారు.

క్రీడాకారులు సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): క్రీడా టోర్నీల్లో ఆటగాళ్లు వ్యక్తిగత ప్రతిభ చాటి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్ సూచించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఫుట్‌బాల్ గ్రాస్‌రూట్ లెవల్ టోర్నమెంటు నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు ఉన్న ఫుట్‌బాల్ క్రీడాంశంలో మరిన్ని మెలకువలు నేర్చుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. జిల్లా ఫుట్‌బాల్ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. టోర్నమెంటుకు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారని, జట్లుగా ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్ విజయ్‌కుమార్, లక్ష్మ బ్రహ్మం, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

గడివేముల: మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామ పంచాయతీ మజరా గ్రామం సోమాపురానికి తారు రోడ్డును మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో 70 ఇళ్లు.. 310 మంది జనాభా ఉన్నారు. కొన్నేళ్ల నుంచి తారు రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న పని పడినా గడివేములకు రావాల్సి ఉంటుంది. కొర్రపోలూరు నుంచి సోమాపురం వరకు 1.5 కిలోమీటర్ల దూరం మెటల్ రోడ్డు ఉంది. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో నడవాలంటే చాలా కష్టంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఏ చిన్న పనిపడినా కొర్రపోలూరు వరకు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి ఆటోలు, బస్సుల్లో వెళ్లాల్సి ఉంటుంది. విద్యార్థులు నిత్యం 20 మంది గడివేములలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూలుకు సైకిళ్లపై వస్తుంటారు. గడివేముల నుంచి సోమాపురానికి నాలుగు కి.మీ దూరం సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి చదువుకుంటున్నారు. మెటల్ రోడ్డు కావడంతో రాళ్లు లేచి ఉండడంతో సైకిల్‌పై రావడం చాలా కష్టంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. సైకిల్ తొక్కడం రాకపోతే స్కూళ్లకు పోవడం మానేయాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో రాత్రి పూట, వర్షా కాలంలో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డు మంజూరుతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొర్రపోలూరు-సోమాపురం రోడ్డు దుస్థితి

ట'మేత'

కర్నూలు(రూరల్): ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస ధర లేకపోవడంతో జీవాలపాలు చేయాల్సి వస్తోంది. కొద్ది రోజులుగా టమాట ధరలు భారీగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం కోత కూలీలు, రవాణా చార్జీలకు కూడా గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేకపోవడంతో పొలాల్లోనే వదిలేస్తున్నారు. చాలా గ్రామాల్లో మేకలు, గొర్రెలకు మేతకు వదిలేశారు. కర్నూలు మండలం నందనపల్లె గ్రామానికి చెందిన రైతు మూలింటి కురువ మద్దిలేటి ఎకరా పొలంలో రూ. లక్ష ఖర్చు చేసి టామట పంట సాగు చేశాడు. అయితే మార్కెట్‌లో కిలో రూ.4 నుంచి రూ.5 పలుకుతుండడంతో విధిలేని పరిస్థితిలో జీవాలకు మేతగా వదిలేశాడు. మండలంలోని పడిదెంపాడు, ఈ.తాండ్రపాడు, నందనపల్లె, పూడూరు, తదితర గ్రామాల్లో ఇదే దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. ధరలు పడిపోయి రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నా పాలకులు దృష్టి సారించకపోవడం శోచనీయం.



నందనపల్లెలో జీవాలకు వదిలేసిన టమాట పంట

నేడు ఫిజియోథెరపీ క్యాంప్

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు ప్రతి సోమవారం ఫిజియోథెరపిస్టు వీరేష్ ఫిజియోథెరపీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యుల్లోని దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి ఫిజియోథెరపి చేయించుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

కర్నూలు(సెంట్రల్): గ్రూపు–2 నోటిఫికేషన్‌లోని రోస్టర్ విధానంలో ఉన్న తప్పులను సరి చేసి తరువాత మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని కోరిన నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు వై.నగేష్, అబ్దుల్లా ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మూడు రోజులుగా ఆందోళనలు తీవ్రం కావడంతో చంద్రబాబు, లోకేష్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం డ్రామా ఆడారన్నారు. ఓ వైపు పరీక్షలను నిలుపుదల చేయాలని ఏపీపీఎస్‌సీకి లేఖ రాసి, మరోవైపు తన చేతుల్లో ఏమీ లేదని చెప్పడం దుర్మార్గమన్నారు. కేవలం ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే ఏపీపీఎస్‌సీకి లేఖ రాశారని, నిరుద్యోగ అభ్యర్థులు గమనించి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

స్టాపింగ్ కష్టాలు



ఫ్లై ఓవర్ వద్దనే ప్రయాణికులను దింపుతున్న ఆర్టీసీ

పాణ్యం: మండల పరిధిలోని జాతీయ రహదారికి హైవే అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో కర్నూలు నుంచి పాణ్యం వచ్చే వాహనాలను చందమామ హోటల్ వద్ద డైవర్షన్ చేసి వన్‌వేలో వెళ్లేలా మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇదే అదునుగా చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను బస్టాండ్‌లోకి రాకుండానే ఫ్లై ఓవర్ వద్దనే వదిలి వెళ్తున్నారు. పాణ్యంలోకి బస్సులు వెళ్లేందుకు హైవే సిబ్బంది ఏర్పాట్లు చేసినా ఆర్టీసీ బస్సులు మాత్రం ప్రయాణికులను రోడ్డుపైనే వదిలి వెళ్తున్నాయి. కర్నూలు, బేతంచెర్ల నుంచి ఆర్డినరీ, సింగిల్ స్టాప్ ఎక్స్‌ప్రెస్‌లు పాణ్యం బస్టాండ్ వరకు రావాల్సి ఉన్నా కొందరు డ్రైవర్లు బేఖాతర్ చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుని స్టాపింగ్ ఉన్న బస్సులు బస్టాండ్‌కు వచ్చేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణం.. ప్రమాదం



ప్రహరీ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న మార్గం

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పడిదెంపాడు– పూడూరు మార్గంలో ఉన్న కేసీ కెనాల్ వంతెన వద్ద ప్రహరీ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఆయా గ్రామాల ప్రజలు నిత్యం కర్నూలుకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే అలంపూర్ జోగులాంబ అమ్మవారి దర్శనానికి భక్తులు వెళుతుంటారు. కెనాల్ ఉపరితల వంతెన వద్ద మలుపు ఉండడం.. పక్కనే వాగు ప్రవహిస్తుండడం.. ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. వరద సమయాల్లో నీరు వంతెనపై ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని.. అధికారులు స్పందించి వాగుకు ఇరువైపులా ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

కార్పొరేషన్ రుణాలకు నేటి నుంచి ఇంటర్వ్యూలు

కర్నూలు (టౌన్): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ సమావేశ హాలులో ఈనెల 24, 25 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ యాక్షన్ ప్లాన్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ, కాపు, రెడ్డి, కమ్మ, వైశ్య కులాలకు చెందిన 5,716 మంది అభ్యర్థులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 60 బ్యాంకుల అధికారులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారని పేర్కొన్నారు. 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు (1 నుంచి 30వ సచివాలయాల పరిధిలోని వారికి), మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు (31 నుంచి 70వ సచివాలయాలు), అలాగే 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు (71 నుంచి 105 సచివాలయాలు), మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు (106 నుంచి 137 సచివాలయాలు) వారికి ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పత్రాలు తీసుకొని హాజరుకావాలని సూచించారు.

26న 'బాల నాగమ్మ' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ రాత్రి 7.30 గంటలకు సీక్యాంప్ కళాక్షేత్రంలో ×బాల నాగమ్మ₹ పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. సాయి సంతోషి సురభి నాటక మండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. లక్ష్మీకాంతరావు, బలరాం కార్యక్రమ కన్వీనర్లుగా వ్యవహరిస్తారని, కళాభిమానులు అందరూ హాజరు కావచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా మహాశివరాత్రి రోజు శ్రీశైలంలో ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.

కాల్వబుగ్గలో ఏర్పాట్ల పరిశీలన



పెద్ద కోనేటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: కాల్వబుగ్గలో ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం సాయంత్రం కాల్వబుగ్గను సందర్శించి, బ్రహ్మోత్సవ ఏర్పాట్లను టీటీడీ పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. ముందుగా భ్రమరాంబ, బుగ్గరామేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, క్యూలైను పరిశీలించారు. ఆలయ వెలుపల ఉన్న పెద్ద కోనేరు, చిన్న కోనేటిని పరిశీలించి, భక్తుల స్నానాలకు ఇబ్బంది లేకుండా నీటితో నింపాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆలయ ఈఓ మద్దిలేటి, ఉత్సవ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి రామచంద్రుడు ఉన్నారు.

జీఓ విడుదల చేయాలని అర్ధనగ్న ప్రదర్శన



గూడూరులో సివిల్ సప్లై గోదాము ఎదుట నిరసన తెలుపుతున్న హమాలీలు

కోడుమూరు రూరల్: పెంచిన కూలీ రేట్ల జీఓను విడుదల చేయాలని కోరుతూ గూడూరు సివిల్ సప్లై గోదాములో పనిచేసే హమాలీలు అర్ధనగ్నంగా నిలబడి ఆదివారం నిరసన తెలిపారు. పెంచిన కూలీ రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 3 రోజులుగా గూడూరు ఎంఎల్ఎస్ పాయింట్ దగ్గర సివిల్ సప్లై హమాలీలు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా హమాలీ కార్మికులకు సంబంధించి పెంచిన కూలీ రేట్ల జీఓను విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల చాలీచాలని కూలితో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెంచిన కూలీ రేట్ల జీఓను విడుదల చేయడంతో పాటు, కార్మికులకు పెన్షన్, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీలు రాజశేఖర్, మధు, రామాంజినేయులు, దానమన్న, సురేష్, రంగన్న, గోపి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు ఢమాల్

- పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు
- బర్డ్ ఫ్లూ భయంతో నోరు కట్టేసుకుంటున్న మాంసం ప్రియులు
- నష్టాలు మూట కట్టుకుంటున్న పౌల్ట్రీ రైతులు
- ధరలు తగ్గించినప్పటికీ పెరగని అమ్మకాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఒక వైపు బర్డ్‌ఫ్లూ భయం, మరోవైపు మహాశివరాత్రి నేపథ్యంలో చికెన్, కోడి గుడ్ల అమ్మకాలు పూర్తిగా పడిపోయాయి. ఆదివారం మాంసం వ్యాపారం అంతంత మాత్రంగానే జరిగింది. వరుసగా బర్డ్‌ఫ్లూ వెలుగు చూసిన తర్వాత ఈ నెల 16వ తేదీ ఆదివారం అమ్మకాలు లేక పౌల్ట్రీ రైతులు, చికెన్ సెంటర్ల నిర్వాహకులు భారీగా నష్టపోయారు. ఈ ఆదివారం కూడా అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. బర్డ్‌ఫ్లూ పాజిటివ్ వచ్చిన ఎన్ఆర్ పేటలోనే కాదు.. నగరం మొత్తంగా చికెన్ అమ్మకాలు పడిపోయాయి. అమ్మకాలు పెరగక పోవడానికి శివరాత్రి ప్రభావం కూడా ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ నెల మొదటి వారంతో పోలిస్తే 30 శాతం వరకు మాత్రమే అమ్మకాలు ఉన్నట్లు తెలుస్తోంది. శివరాత్రి తర్వాత చికెన్, గుడ్ల అమ్మకాలు పెరిగే అవకాశం ఉంది. పౌల్ట్రీ పరిశ్రమను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చికెన్, గుడ్ల అమ్మకాలను పెంచే దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. చికెన్ పట్ల ఇప్పటికీ వినియోగదారులు ఆసక్తి చూపని నేపథ్యంలో మటన్ ధరలను వ్యాపారులు మరింత భారీగా పెంచేశారు. కిలో రూ.900, రూ.1000 వరకు పెంచి అమ్మకాలు సాగించారు. చికెన్/గుడ్లను 70 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉడికించి తినవచ్చని పశుసంవర్ధక శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నా.. వినియోగదారులు మాత్రం ఆసక్తి చూపలేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. బర్డ్‌ఫ్లూ, శివరాత్రి నేపథ్యంలో చికెన్ అమ్మకాలను పెంచుకునేందుకు వివిధ ప్రాంతాల్లో ధర తగ్గించినట్లు తెలుస్తోంది. వెల్దుర్తిలో కిలో చికెన్ ధర గత వారం రూ.180 ఉంది. తాజాగా రూ.100/120 పెట్టారు. ధరలు తగ్గించినప్పటికీ అమ్మకాలు మాత్రం పెరగలేదని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. ఒక్కో చికెన్ సెంటరులో సగటున 200 కిలోల వరకు అమ్మకాలు జరుగుతాయి. ఒకవైపు బర్డ్‌ఫ్లూ, మరోవైపు శివరాత్రి వేడుకలు మొదలు కావడంతో చికెన్ అమ్మకాలు గత వారం తరహాలోనే ఉండిపోయాయి.



వెల్దుర్తిలో చికెన్ ధర తగ్గించినప్పటికీ వెలవెలబోతున్న చికెన్ సెంటరు

600 కోళ్లు మాత్రమే అమ్మాం

మేము కర్నూలు శివారులోని వెంగన్నబావి దగ్గర బావి పౌల్ట్రీ పేరుతో బ్రాయిలర్ కోళ్ల వ్యాపారం చేస్తున్నాం. మామూలుగా అయితే ఆదివారం 3000 కోళ్లు ఆపైనే విక్రయిస్తాం. బర్డ్‌ఫ్లూ వెలుగు చూసిన తర్వాత ఈ నెల 16న కేవలం 450 కోళ్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఈ ఆదివారం వ్యాపారం బాగా ఉంటుందని ఆశించాం. కానీ నిరాశాజనకంగానే ఉంది. కేవలం 600 కోళ్లు మాత్రమే అమ్మాం. నాటు కోళ్ల వ్యాపారం కూడ చేస్తాం. బర్డ్‌ఫ్లూ తర్వాత నాటు కోళ్లు తెప్పించడం బంద్ చేశాం. అమ్మకాలు ఇలా ఉంటే నష్టాలతో కోలుకోవడం కష్టం. బర్డ్‌ఫ్లూ నేపథ్యంతో చికెన్, గుడ్ల అమ్మకాలను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి.

– లక్ష్మిరెడ్డి, బ్రాయిలర్ కోళ్ల వ్యాపారి, కర్నూలు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



ప్రభాకర్(ఫైల్)

ఓర్వకల్లు: నన్నూరు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామానికి చెందిన కాశపోగు ప్రభాకర్(45) ఇదే మండలం బైరాపురం గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశాడు. ఈ క్రమంలో పంటను పరిశీలించి, సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వెళుతున్నాడు. మార్గమధ్యలో కర్నూలు నుంచి బైరాపురం వైపు వెళ్తున్న ఓ బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రభాకర్‌ను చికిత్స నిమిత్తం పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య పుల్లమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిసింది. మృతునికి భార్యతో పాటు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కొత్తూరులో భక్తుడి మృతి



మృతుడు పుల్లారెడ్డి (ఫైల్)

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు సుబ్రమణ్యేశ్వర స్వామిని దర్శనం చేసుకుని ఆటో ఎక్కుతుండగా ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లె గ్రామానికి చెందిన బుసుపల్లి పుల్లారెడ్డి(48) కుటుంబ సభ్యులతో కలిసి కొత్తూరు గ్రామంలోని సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయానికి వచ్చారు. ఉదయం స్వామివారిని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం అయ్యేందుకు ఆటో వద్దకు చేరుకున్నారు. ఇంతలోనే ఉన్నట్టుండి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఆటోలోకి ఎక్కించారు. 108కి సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య రామేశ్వరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా ఆలయానికి ఆది, మంగళవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని.. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్టు..!



కళకళలాడుతున్న పొగాకు పంట

కోడుమూరు రూరల్: గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద రైతులు సాగు చేసిన ఆరుతడి పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఆరుతడి కింద సుమారు 3500 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న, కొర్ర, పొగాకు వంటి పటలను సాగు చేశారు. సాగు చేసిన పంటలకు ఇరిగేషన్ అధికారులు వంతుల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగు చేసిన పంటలన్ని ప్రస్తుతం పచ్చదనంతో చూపరులకు కనువిందు చేస్తున్నాయి.



కనివిందు చేస్తున్న కొర్ర పంట

చికెన్ వద్దు.. చేపలే ముద్దు

కోడుమూరు రూరల్: ఆదివారం వచ్చిందంటే చికెన్ ముక్క లేనిదే ముద్ద తినని చాలామంది ప్రజలు బర్డ్ ఫ్లూ భయంతో తినడం మానేశారు. అయితే మటన్ కొందామంటే మార్కెట్లో కిలో రూ.800 నుంచి రూ.900 వరకు పలుకుతోంది. కొనలేని సామాన్య జనం చేపల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో చేపల రేటు కూడా అమాంతం పెరిగిపోయింది. నిన్న మొన్నటి వరకు కిలో రూ.150 పలికిన చేపల ధర ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200 విక్రయిస్తున్నారు. అయినప్పటికీ సామాన్య జనం చికెన్ తినలేక చేపల తింటూ సరిపెట్టుకుంటున్నారు. ఆదివారం కోడుమూరులో చికెన్ షాపులు జనం లేక వెలవెలబోయాయి. అదే సమయంలో చేపల వ్యాపారుల వద్ద భారీగా జనం గుమిగూడి చేపలను కొనుగోలు చేశారు.



కోడుమూరులో చేపలు కొనేందుకు ఆసక్తి చూపుతున్న జనం

విరగబూసిన బంతి పూలు



బంతిపూల తోట

కల్లూరు: మండలంలో చిన్నటేకూరు, పెద్దటేకూరు, దొడ్డిపాడు, బస్తిపాడు గ్రామాల్లోని రైతులు పూలతోటలను ఎక్కువగా సాగు చేస్తారు. పెద్దటేకూరు సమీపంలో బంతిపూల తోట విరగబూసింది. తోటలో విరగబూసిన బంతిపూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.